
క్లుప్తంగా

28న తైబజార్ వేలం

తుక్కుగూడ: మున్సిపాలిటీ కేంద్రంలోని తైబజార్ (వారాంతపు సంత) 2023–24 సంత్సరానికి గాను ఈ నెల 28న మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ పేరిట రూ.2 లక్షల నగదు డీడీ, రూ.2 లక్షల బ్యాంకు సాల్వేషన్ సర్టిఫికేట్ తో దరఖాస్తు ఫారంలో తమ పూర్తి వివరాలను ఈ నెల 26లోగా అందజేయాలన్నారు.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతిపైన మంగళవారం మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు సామూహిక సత్యనారాయణ స్వామి వత్రాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కార్తీక్‌రెడ్డిని సన్మానించిన కమిటీ సభ్యులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి శ్రీరాం కాలనీలోని జై సాయి భవానీ మాత మందిరం 11వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయన్ను సన్మానించారు. అనంతరం కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పల్లపు శంకర్, లక్ష్మీనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు సూరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ షేక్ జహంగీర్, ఉప్మెమూరి నిరంజన్, దూడల సుధాకర్‌గౌడ్, యంజాల అర్జున్, మారుతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం నిధులు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

మహేశ్వరం: గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని మాణిక్యమ్మ గూడ సర్పంచ్ మాసారం చంద్రయ్యగౌడ్ అన్నారు. మంగళవారం గ్రామంలో రూ.10లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రతీ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాల ఏర్పాటుతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు మల్లేశ్, రంగారెడ్డి, జంగయ్య, రఘునాథ్‌రెడ్డి, నాదిరెడ్డి, రాజు, జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు రద్దు చేయాలి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్



మహేశ్వరం కోర్టు ఎదుట ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

మహేశ్వరం: ఘట్‌కేసర్ పోలీసులు న్యాయవాది సత్యనారాయణపై పెట్టిన అక్రమ కేసులను రద్దు చేయాలని మహేశ్వరం కోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులు కేసుల విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే పోలీసులు దుర్భాషలాడుతూ.. అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జగన్



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు

వికందుకూరు: ప్రజల సొమ్మును కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న నిర్వహించ తలబెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరు జగన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అంకగళ్ల కుమార్ అధ్యక్షతన ఈ జీపుజాతకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర రూ.399 ఉండగా, నేడు రూ.1150కు చేరిందన్నారు. పెట్రో, డీజిల్ ధరలు ఇష్టానుసారంగా పెంచుతూ పేదల నడ్డి విరుస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీ ఏమయిందని ప్రశ్నించారు. కార్మికుల పొట్టగొట్టే లేబర్ కోడ్, విద్యుత్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని, ఆహార వస్తువులు, నిత్యావసరాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికి గృహ వసతి కల్పించాలన్నారు. ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా శ్రేణులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు, నాయకులు శేఖర్, గాదె కుమార్, గౌర శ్రీశైలం, అంజయ్య, ఎం.యాదయ్య, జి.సత్తయ్య, సతీశ్, ప్రజానాట్య మండలి కళాకారులు పాల్గొన్నారు.

ఉగాది.. కొనుగోళ్లతో రద్దీ!

మున్సిపాలిటీ పరిధిలో ఉగాది సందడి ప్రారంభమైంది. బుధవారం పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం నుంచే ప్రజలు మామిడాకులు, కాయలు, వేపపువ్వు, కొత్త కుండలు, పూలు తదితర సామగ్రి కొనుగోలు చేస్తూ కనిపించారు. దీంతో మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీశైలం హైవే రద్దీగా మారింది. – తుక్కుగూడ



తుక్కుగూడలో విక్రయానికి కొత్త కుండలు

ఉగాది ఉత్సవాలకు ఆహ్వానం



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన శోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని మంత్రి సబితారెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం జిల్లెలగూడలోని ఆమె క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఉగాది పంచాంగ శ్రవణం వేడుకలకు ఆహ్వానించి పంచాంగ శ్రవణాన్ని ఆవిష్కరించామని కాలనీ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జగిని రామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 22న ఉగాది, 30న సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

బాలాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని మంత్రి సబితారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుడతామన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కారకర్తలే బలం

ఆత్మీయ సమ్మేళనంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతన్న నర్సింహ

తలకొండపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిత్యావసర సరుకుల ధరలను తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సింహ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో అవినీతి పరిపాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతిని ఎండగట్టాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైన ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, కార్యదర్శులు అంజయ్యగుప్తా, గుజ్జుల మహేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, బిచ్చనాయక్, సర్పంచ్ శ్రీశైలం, ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఎంపీటీసీలు రాములు, వెంకటయ్య, నర్సమ్మ, సోషల్ మీడియా అసెంబ్లీ ఇన్‌చార్జి అజీం, యువజన అ.ధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, ఆరీఫ్, రమేష్ పాల్గొన్నారు.

గేదె అపహరణ

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ గ్రామంలో గుర్తు తెలియని దుండగులు గేదెను అపహరించారు. బాధితుడు మాడుగుల శ్రీశైలం తెలిపిన ప్రకారం.. ఆయన వ్యవసాయం క్షేత్రంలోని షెడ్‌లో రోజు మాదిరిగానే గేదెను ఉంచాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించారు. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధితుడు మంగళవారం కందుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘కంటి వెలుగు’ సీఎం పాలనకు నిదర్శనం

జెడ్పీటీసీ సభ్యుడు జంగారెడ్డి



కంటి వెలుగు శిబిరం ప్రారంభోత్సంలో పాల్గొన్న జంగారెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు

కందుకూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం సీఎం కేసీఆర్ పాలనకు నిదర్శనమని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొలన్‌గూడలో సర్పంచ్ గీతేశ్వరి గణేశ్‌తో కలిసి వారు కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కంటి వెలుగు శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి సబితారెడ్డి చొరవతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ బండ విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గొరికెల బీరప్ప, బీసీ సెల్ అధ్యక్షుడు ఎ.పాండుగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.సామయ్య, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆదర్ల వెంకటేశ్, నాయకులు గణేష్, బండ రాజు, నజీరుద్దీన్, పొట్టి ఆనంద్, కార్తీక్, విఘ్నేశ్వర్‌రెడ్డి, దీక్షిత్‌రెడ్డి, మహేశ్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, వైద్యులు, ఆశ, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రతీ వార్డులో అభివృద్ధి పనులు

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

మహేశ్వరం: మహేశ్వరం మేజర్ గ్రామ పంచాయతీలోని ప్రతీ వార్డులో యూజీడీ, సీసీ రోడ్లు, ఇంటింటికి తాగునీటి వసతి, వీధి దీపాల ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం, ఎంపీటీసీ సభ్యుడు పి.సుదర్శన్ యాదవ్ అన్నారు. మంగళవారం వారు మండల కేంద్రంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో శివగంగ ఆలయ డైరెక్టర్ కర్రోళ్ల చంద్రయ్య, బీఆర్‌ఎస్ నాయకులు రాజేష్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, రాఘవేందర్, శ్రీనివాస్, లింగం, వీరుబాబు, పరమేశ్, శ్రీకాంత్, కుమార్, రమేశ్, సంజీవ, చంద్రమౌళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా అమావాస్య పల్లకీ సేవ

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు నక్షత్ర హారతి దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోనమోని శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, పాలక మండలి సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అమావాస్య హోమం

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకుని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్ కుమార్‌జోషి ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. స్వామి నిఖిలేశ్వరానంద, చండీమాత విగ్రహాలకు ప్ర త్యేక పూజల అనంతరం హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి చేశారు. అనంతరం గురూజీ ప్రవచనాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



హుడా పార్కులో మొక్కనాటుతున్న ఎమ్మెల్యే

వనస్థలిపురం: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మంగళవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వెనుక ఉన్న హుడా పార్కులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే తరాలకు పచ్చదనంతో కూడిన ప్రపంచాన్ని అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించుకొని ధరిత్రిని కాపాడుకోవాలని అన్నారు.

మహిళ అదృశ్యం

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సాహెబ్‌నగర్ అంజమ్మ అపార్టమెంటులో ఉంటున్న స్వాల నగేశ్ తల్లి బాలమ్మ గత నెల 28న ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుమారుడు నాగేశ్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.